# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి



ములుగు టౌన్ : అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

■ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు టౌన్, అక్టోబర్ 16 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ అర్జీలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డీ వేణు గోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్ వెంకన్న, ఆర్డీవో కే సత్యపాల్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారులు విన్నవించే సమస్యలపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఒకసారి ప్రజావాణికి వచ్చిన అర్జీలు మరోసారి రా కుండా చూడాలని సూచించారు. పలు సమస్యలపై 15 అర్జీలు రాగా కొన్నింటిని సత్వరమే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రసూనారాణి, ఏటీడీవో దేశీరాం, పశు సంవర్ధక శాఖ అధికారి విజయభాస్కర్, జిల్లా పౌర సరఫరాల అధికారి అరవింద్ రెడ్డి, మేనేజర్ రాములు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి నాగేశ్వర్‌రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డీసీవో సర్దార్ సింగ్, జిల్లా ఉపాధి కల్పన అధికారి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

**ఐటీడీఏలో..**

ఏటూరునాగారం : ఐటీడీఏ కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీవో వసంతరావుకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. మండలంలోని కొండాయి గ్రామ సర్పంచ్ కాకా వెంకటేశ్వర్లు, గ్రామస్తులు అట్టం నాగరాజు, దబ్బగట్ల బాబు, రాజారాం, గోవర్ధన్, బొచ్చు మహేందర్, పరికి నర్సింగారావు, మాదరి భాస్కర్ తదితరులు తమకు ఎత్తైన ప్రదేశంలో ఇండ్ల స్థలాలు కేటాయించాలని, వరదలతో తీవ్రంగా నష్టపోతున్నట్లు వివరించారు. తాడ్వాయి మండలం కొడిశాల ప్రాంతానికి చెందిన రైతులు తమ పంట భూములకు విద్యుత్ లైన్, వ్యవసాయ మోటర్లు ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. పాలెం వాగు ప్రాజెక్టు నిర్వహణలో తమను ఏజెన్సీ ద్వారా లష్కర్లుగా నియమించుకునేందుకు సిఫారసు చేయాలని పలువురు యువకులు విన్నవించారు. ఉద్యోగం ఇప్పించాలని, బ్యాంకర్లు వ్యవసాయ రుణ విషయంలో ఇబ్బందులు పెడుతున్నారంటూ వినతి పత్రాలు సమర్పించారు.



ఏటూరునాగారం : వినతులు స్వీకరిస్తున్న ఏపీవో వసంతరావు

## మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

ములుగు రూరల్, అక్టోబర్ 16 : మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, దీనిపై జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని డీడబ్ల్యూవో ప్రేమలత అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ శాఖ భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, ములుగు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు మనుషుల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రేమలత మాట్లాడుతూ అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణా కాకుండా చూడాలంటే ప్రజల్లో అవగాహన అవసరమన్నారు. ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతులపై వారిని అప్రమత్తం చేస్తూ మంచి మార్గాల వైపు నడిపించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ చంద్రయ్య మాట్లాడుతూ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా 27 ఏళ్లుగా డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్, పోలీస్, జ్యుడీషియల్ శాఖల సమన్వయంతో 28 వేల మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. నేటి యువత మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని, వారిని అంగన్‌వాడీలు అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ములుగు సీడీపీవో స్వాతి, స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సరస్వతి, కావ్య, అరుణ, భాగ్యలక్ష్మి, కరీమున్నీసా, అంజమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో ప్రేమలత

## కాచి చల్లార్చిన నీటినే తాగాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 16 : ప్రజలు రోజు వారీగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని మల్లాపురం, కొండాపురం, చిరుతపల్లి, మొర్రవానిగూడెం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ మేరకు భవ్యశ్రీ ఆయా గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు, సిబ్బంది

# గ్రామాల్లో డీఎంహెచ్‌వో పర్యటన

■ ఫీవర్ సర్వే పరిశీలన

మంగపేట, అక్టోబర్ 16 : గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో మండలంలోని బ్రాహ్మణపల్లి, చుంచుపల్లి, మంగపేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పరిధిలోని కమలాపురం ఒడిస్సా కాలనీ, రాజుపేట, రమణక్కపేట గ్రామాల్లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బంది చేస్తున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల వద్ద జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు జరిపి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో కొనసాగుతున్న శానిటేషన్ పనులను పర్యవేక్షించి సూచనలు చేశారు. ఒడిస్సా కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు చూసి స్థానికులకు పలు సూచనలు చేశారు. దోమలు వ్యాపించి జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు నీరు నిలిచిన చోట ఆయనే స్వయంగా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. రాజుపేట పల్లె దవాఖాన (హెల్త్ వెల్‌నెస్) పనులను పరిశీలించారు. ఇక్కడి ప్రైవేటు క్లినిక్, మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారులు కారం నిఖిల్ కుమార్, యమున, స్వప్నిత, సీహెచ్‌వో దుర్గారావు, రంగారెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది ఉన్నారు.



బురద నీటి గుంతలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న డీఎంహెచ్‌వో

## సీఐ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఎస్పీ

ములుగు రూరల్, అక్టోబర్ 16 : ములుగు సీఐ కార్యాలయాన్ని సోమవారం డీఎస్పీ రవీందర్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించిన అనంతరం కేసుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సీఐ కార్యాలయ పరిధిలో ఆయుధ లైసెన్స్ కలిగిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కింది స్థాయి ఉద్యోగుల పనితీరు మెరుగ్గా ఉండాలని సూచించారు. అండర్ ట్రయల్ కేసుల వివరాలను సరిగా నమోదు చేయాలని సూచించారు. డీఎస్పీ వెంట సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.





రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్

## 7వ జోనల్ స్థాయి క్రీడల్లో ఓవరాల్ చాంపియన్ ఏటూరునాగారం

ఏటూరునాగారం, అక్టోబర్ 16 : ఏడవ జోనల్ స్థాయి క్రీడల్లో ఏటూరునాగారం గిరిజన క్రీడా పాఠశాల, కళాశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరాజు తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ములుగు జిల్లా ఇంచర్ల గురుకుల పాఠశాలలో భూపాలపల్లి, ములుగు, వరంగల్ రీజినల్ 7వ జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు పాఠశాల, కళాశాల నుంచి 75 మంది క్రీడాకారులు పాల్గొని పలు విభాగాల్లో గెలుపొంది తమ సత్తా చాటారన్నారు. ఈ మేరకు క్రీడాకారులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరాజు, పీడీలు రమణ, శ్రీను, బాక్సింగ్ కోచ్ వేణుగోపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



గెలుచుకున్న పతకాలతో క్రీడాకారులు

# వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

■ పలు అవతారాల్లో దర్శనమిచ్చిన దుర్గామాత

ఏటూరునాగారం, అక్టోబర్ 16 : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ నిర్మాణ స్థలం, రామాలయం, శివాలయం, సాయిబాబా ఆలయంలో అర్చకులు రాధాకృష్ణ శర్మ, నాగేశ్వర్‌రావు శర్మ, సుదర్శన్ శర్మ, రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో స్టార్ యూత్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**బాలా త్రిపుర సుందరిగా..**

గోవిందరావుపేట : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో కొలువుదీరిన దుర్గామాత సోమవారం భక్తులకు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆచార్యులు డింగరి సునీల్, అంజిత్‌స్వామి రుద్రహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు.

**వెంకటాపూర్‌లో..**

వెంకటాపూర్ : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ, పాలంపేట ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో దుర్గామాత ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. రెండో రోజైన సోమవారం అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. సర్పంచ్ మెడబోయిన అశోక్, ఉత్సవ కమిటీ సభ్యులు కొంక జనార్దన్, మార్క రాజు, కృష్ణారెడ్డి, రమణారెడ్డి, రమేశ్, అరవింద్ పాల్గొన్నారు.



ఏటూరునాగారం : గాయత్రి అవతారంలో అమ్మవారు



గోవిందరావుపేటలో రుద్రహోమం



వెంకటాపూర్ : అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు